ఆపన్నహస్తం అందించండి

దవాఖానలో చికిత్స పొందుతున్న మహేందర్

- ఇంటి పెద్దదిక్కుకు చెడిపోయిన రెండు కిడ్నీలు
- కిడ్నీల మార్పిడికి ₹30లక్షలు అవసరమని చెప్పిన వైద్యులు
- దాతల సాయం కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు

కోనరావుపేట, నవంబర్ 26: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. కూలీ పనిచేసుకుంటూ కుటుంబ భారాన్ని మోసే పెద్దదిక్కుకు కిడ్నీలు చెడిపోయి దవాఖానలో మంచానపడ్డాడు. కిడ్నీలు మార్పిడి చేస్తేనే బతుకుతాడని వైద్యులు చెప్పగా, ఆ కుటుంబ సభ్యులు కన్నీంటి పర్యంతమవుతున్నారు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కదిరె మహేందర్ ఊరిలో ఉపాధి లేక కొన్నేండ్ల కిత్రం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ఆరోగ్యం సరిగా లేక వైద్యం చేయించుకునేందుకు చేతిలో చిల్లగవ్వ లేక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో మహేందర్‌కు కాళ్లు వాపులు రావడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలు చెడిపోయాయని, వెంటనే కిడ్నీ మార్పిడి చేయాలని తెల్పిచెప్పారు. కిడ్నీ మార్పిడి కోసం సుమారు ₹30లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. దాతలు సాయం అందించాలని బాధితుడి భార్య సంధ్య, కొడుకు ముకేష్, కూతురు మను వేడుకుంటున్నారు.

సాయం అందించేవారు సంప్రదించాలి
7794962176 నంబర్‌కు
గూగుల్‌పే, ఫోన్‌పే
కదిరె మహేందర్
బ్యాంకు ఖాతానంబర్: 20331664274
బ్యాంక్‌పేరు: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
బ్రాంచ్: వేములవాడ
ఐఎఫ్‌సీకోడ్: SBIN0017241

కొనుగోళ్లు వేగవంతం చేశాం

కలెక్టరేట్, నవంబర్ 26: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి న్యూఢిల్లీ నుంచి ధాన్యం కొనుగోళ్లపై ఇతర మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 248కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. జిల్లాలో 23,476మంది రైతుల నుంచి 1,47,305 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,02,438మెట్రిక్ టన్నుల ధాన్యానికి గానూ రూ.238కోట్లు 1,486మంది రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఇక్కడ డీఆర్డీవో శేషాద్రి, డీఎం సివిల్ సప్లయి అధికారి రజిత, డీసీఎస్‌వో వసంత లక్ష్మి, డీసీవో రామకృష్ణ ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

వేములవాడ రూరల్, నవంబర్ 26: వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డైరెక్టర్ పరశురాములును మంగళవారం మర్రిపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సన్మానించారు. అలాగే రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇక్కడ అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

నేడు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, నవంబర్ 26: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. ఆలయ ఓపెన్ స్లాబ్ పై ఉదయం 8 గంటలకు నిర్వహించే హుండీ లెక్కింపులో అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొనాలని సూచించారు.

నామినేషన్ల ఆహ్వానం

కలెక్టరేట్, నవంబర్ 26: ప్రముఖ క్రైస్తవులు, సంస్థల సన్మానం కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ (మైనారిటీలు) ఫైనాన్స్ కార్పొరేషన్ క్రిస్మస్ సంబురాల్లో భాగంగా సామాజిక సేవా కార్యకలాపాలు, కనీసం పదేండ్లు అంతకంటే ఎక్కువ కాలం నుంచి సేవలందిస్తున్న ప్రముఖ క్రైస్తవులను సత్కరించడానికి నామినేషన్లను డిసెంబర్ 5లోగా అందించాలన్నారు. వివరాల కోసం 040-23391067, 99499 10328 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

తెలంగాణభవన్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు

తెలంగాణ చౌక్: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా వ్యాప్తంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు.

కలెక్టరేట్, నవంబర్ 26: కలెక్టరేట్ ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ సీపీవో శ్రీనివాసాచారి, డీపీఆర్వో వీ శ్రీధర్, ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జావేద్ అహ్మద్, శ్రీకాంత్, పుష్పలత, షరీఫ్, వేణు, ప్రవీణ్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వేములవాడ, నవంబర్ 26: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో గంగిపల్లి స్వామికుమార్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించగా, ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, ఎన్‌వైకేఎస్ జిల్లా అధికారి రాంబాబు, గంగిపల్లి రాజశేఖర్, కొలుపుల కార్తీక్, నజీర్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ చౌక్, నవంబర్ 26: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్‌ఐలు మధుకర్, రమేశ్, సీఐలు శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఉన్నారు.

గంభీరావుపేట, నవంబర్ 26: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ఆవశ్యకతపై వారు వివరించారు.

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 26: గొల్లపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి రాజ్యాంగం గొప్పదనాన్ని వివరించారు. ఇక్కడ సంఘం సభ్యులు సామల్ల సత్తయ్య, పాటి దేవయ్య, పుట్టి సతీశ్, చీకట్ల సతీశ్, పాటి నర్సింహులు, బండి కిష్టయ్య, పాశం హరీశ్, బండి రాజు, గడ్డమీది సాయిచంద్, చింతల రాహుల్, పాశం రామకృష్ణ, క్యారం నిషాంత్ ఉన్నారు.

ఇల్లంతకుంట, నవంబర్ 26: మండల కేంద్రంతో పాటు అన్ని పాఠశాలలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్‌కు రుణపడి ఉంటామని ఉపాధ్యాయులు తెలిపారు.

తెలంగాణ చౌక్, నవంబర్ 26: సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వనజకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇక్కడ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్‌రెడ్డి, అధ్యాపకులు, ఉన్నారు.

ముస్తాబాద్, నవంబర్ 26: ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బీరయ్య, సుపరింటెండెంట్, కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

కోనరావుపేట, నవంబర్ 26: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ లీడర్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ప్రాధాన్యత వివరిస్తూ, ప్రజాప్రతినిధులను ఎలా ఎన్నుకొంటారో సూచించారు. ఇక్కడ హెచ్‌ఎం మంజులాదేవి, టీచర్లు ఉన్నారు.

వేములవాడ రూరల్, నవంబర్ 26: రాజ్యాంగం గొప్పదనాన్ని చాటిచేప్పేలా వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, అగ్రహారం డిగ్రీ కళాశాలలో లఘు నాటికను ప్రదర్శించారు. ఇక్కడ అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఆర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి మర్కొండ శకుంతల, శారద, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

వేములవాడ, నవంబర్ 26: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ నేతలు రేగుల మల్లికార్జున్, పిన్నింటి హన్మాండ్లు, రేగుల రాజ్‌కుమార్ ఉన్నారు.

వేములవాడ: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

కలెక్టరేట్: అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ, నవంబర్ 26: గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థిని శైలజ మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శైలజ మృతి పట్ల మంగళవారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించి మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో కలుషిత ఆహారంతో నిరుపేద బిడ్డల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన చెందారు. బాధితురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకులాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం ఆహార భద్రత అధికారులతో కమిటీని వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ నాయకులు తుమ్మల దిలీప్, సాయి, శివ, సందీప్, ఉమర్ పర్వేజ్, రఫీ, వెంకటేశ్, రాకేశ్, సంతోష్ ఉన్నారు.

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

జనసంద్రంగా మారిన బద్దిపోచమ్మ ఆలయం ముందుభాగం

వేములవాడ టౌన్, నవంబర్ 26: రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధులగుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కల్లు పోసి, సారెపెట్టి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించడానికి భక్తులు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి దాదాపు మూడు గంటలకు పైగా సమయం పట్టింది.

కరెంట్‌షాక్‌తో ఒకరి మృతి

బోయినపల్లి, నవంబర్ 26: కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన రెడ్డవేని నాంపల్లి(52) మంగళవారం కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నాంపల్లి వన్య ప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చుతుండేవాడు. ఈ నేపథ్యంలో మల్కాపూర్, తిప్పయ్యపల్లి గ్రామాల మధ్యలో గుట్ట వద్ద ఓ వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు అమర్చుతుండగా, ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ రావడంతో మృతిచెందాడు. ఏఎస్ఐ మోతీరాం ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న ఆలయంలో రద్దీ

క్యూలో స్వామివారి దర్శనంకోసం నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 26: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం మంగళవారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను దాదాపు 15వేలకు పైగా దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

భావితరాలకు మార్గదర్శకం కేసీఆర్

థియేటర్ వద్ద కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొంటున్న నేతలు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 26: భావితరాలకు మార్గదర్శకుడైన కేసీఆర్ చరిత్రను అద్భుతంగా నిర్మించిన 'కేసీఆర్' సినిమా భారీ విజయం సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆకాంక్షించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విమల్ థియేటర్‌లో కేసీఆర్ సినిమాను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన కేసీఆర్ చరిత్రను నటులు రాకింగ్ రాకేశ్, సుజాత కష్టపడి నిర్మించారని, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, నాయకులు మ్యాన రవి, సత్తార్, దార్ల సందీప్, కుంబాల మల్లారెడ్డి ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

గంభీరావుపేట, నవంబర్ 26: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. నర్మాల రైతు వేదికలో మంగళవారం మండల ఫర్టిలైజర్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎస్ఐ హాజరయ్యారు. ఇక్కడ ఏవో సలావుద్దీన్, ఏఈవో సాయి, ప్రవీణ్, ముకుంద్, తదితరులు ఉన్నారు.

బాలికల పాఠశాలలో మాక్ పోలింగ్

ముస్తాబాద్, నవంబర్ 26: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు హెచ్‌ఎం రవీందర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులకు ఎన్నికల ప్రాముఖ్యత గురించి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య, గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు అంకం రాజశేఖర్ వివరించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఓటేసేందుకు గుర్తింపు కార్డు చూపిస్తూ క్యూలో ఓటర్లు

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం

రామన్నపేటలో ఫ్లాట్‌ఫామ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబర్ 26: ప్రజా పాలన ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మంగళవారం రామన్నపేటలో ఈజీఎస్ ద్వారా ₹2.99లక్షలతో చేపట్టిన ఫ్లాట్‌ఫామ్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఇక్కడ జడ్పీసీఈవో వినోద్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల, ఏవో ప్రణీత, ఏపీడీ నర్సింహులు, ఏపీవో సబిత, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు రవి, మండలాధ్యక్షుడు రమణారెడ్డి, నేతలు లక్ష్మీరాజం, అంజయ్య ఉన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర అందించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కలెక్టరేట్, నవంబర్ 26: జస్టిస్ స్వామినాథన్ కమిషన్ చెప్పిన విధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం కడారి రాములు మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేవీ అనసూయ, జీ పోచయ్య, జీ మల్లయ్య, ఎస్ నర్సయ్య, పీ చంద్రయ్య, నర్సింగోజి, మారుతి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, మచ్చ అనసూయ, గజ్జె దేవదాసు, వేముల రాజేశం, ఆకెన సత్తయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు శిక్ష

వేములవాడరూరల్, నవంబర్26: చోరీ కేసులో ఇద్దరికి ఎనిమిది నెలల జైలుశిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సీఐ వీర ప్రసాద్ పేర్కొన్నారు. సీఐ మాట్లాడుతూ, వేములవాడ మండలం రుద్రవరంలోని మల్లికార్జున ఆలయంలో 3మార్చి 2024న దొంగతనం జరిగినట్లు ఊరడి రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా నిజాబాబాద్ జిల్లా ముప్పల్ మండలం బురుజుగపల్లికి చెందిన గోత్రాల నాగరాజు, మందల సాయి కుమార్‌ను చోరీ కేసులో రిమాండ్‌కు తరలించారు. విచారణ చేసిన అధికారులు కోర్టులో తగిన సాక్షులు ప్రవేశపెట్టడంతో ఇద్దరికి ఎనిమిది నెలల జైలుశిక్ష, ₹వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

కార్మికుల ధర్నా

గంభీరావుపేట, నవంబర్26: పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. కొద్ది నెలలుగా తాము అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌బిల్లులు మంజూరుచేయాలన్నారు.

ఎంఈవోకు సన్మానం

చందుర్తి, నవంబర్ 26: ఇటీవలే బదిలీపై వెళ్లిన ఎంఈవో శ్రీనివాసదీక్షితులును మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో చందుర్తి, రుద్రంగి మండలాల ఎంఈవోలు వినయ్‌కుమార్, రామకృష్ణ సన్మానించారు. ఇక్కడ టీచర్లు, తదితరులు ఉన్నారు.

హత్యనా? సహజ మరణమా?

ఇల్లంతకుంట, నవంబర్ 26: ఒగులాపూర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీనివాస్(38) శనివారం మృతిచెందగా, కుటుంబసభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. అంత్యక్రియల్లో భాగంగా ఇంటి వద్ద మృతదేహానికి స్నానం చేయించకుండా.. నేరుగా చితిమీదికి తరలించడంతో శ్రీనివాస్ అక్క కూస విజయకు అనుమానం వచ్చింది. తర్వాత ఆమె చితి మీద మృతదేహాన్ని పెట్టే క్రమంలో మెడభాగాన్ని చూడడంతో గాయాలై ఉన్నాయి. దహనసంస్కారాలు పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చింది. తమ్ముడు ఎలా చనిపోయాడని తల్లి, మరదలిను నిలదీయగా ఉరేసుకుని చనిపోయాడని వారు సమాధానం చెప్పగా, విజయ అనుమానం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక ఎస్ఐ కరదిరె శ్రీకాంత్‌గౌడ్, రూరల్ సీఐ మొగిలి ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం ఎస్ఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల వైద్య సిబ్బంది దహన సంస్కారాలు నిర్వహించిన ప్రాంతానికి వెళ్లి.. బొక్కలను సోరెన్సిస్ ల్యాబ్‌కు పంపించారు. శ్రీనివాస్‌ది హత్యనా? సహజ మరణమా? అనేది ల్యాబ్ వివరాలు వచ్చిన తర్వాత తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లెల్ల వద్ద ఆటోమేటిక్ కెమెరాలు ప్రారంభం

తెలంగాణ చౌక్, నవంబర్ 26: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. జిల్లెల్ల వద్ద ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ కెమెరాలను ప్రారంభించి, మంగళవారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు జిల్లా సరిహద్దులు జిల్లెల్ల, గంభీరావుపేట, రుద్రంగి, కొదురుపాక వద్ద ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసిన, అనుమానిత వాహనాలను ఈ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

వరికొయ్యకాలు కాల్చొద్దు

కోనరావుపేట, నవంబర్ 26: రైతులు వరి కొయ్యకాలును కాల్చొద్దని ఏవో సందీప్ సూచించారు. మంగళవారం కనగర్తి గ్రామంలో ఓ రైతు వరికొయ్యకాలును కాల్చుతుండగా, ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొయ్యకాల కాల్చివేత వల్ల కలిగే అనర్థాలను ఏవో వివరించారు. కొయ్యలను కాల్చడం ద్వారా భూసారాన్ని కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుందని సూచించారు. నాటు వేసేముందు దుక్కి దున్ని ఎకరానికి 50కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే కొయ్యలు కుళ్లిపోయి సేంద్రియగా మారుతుందని, తద్వారా పంట దిగుబడి పెరుగుతుందని సూచించారు.

సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రారంభం

వేములవాడ, నవంబర్ 26: మున్సిపల్ పరిధిలో ఎన్యూమరేటర్లు సేకరించిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలో 15,901 దరఖాస్తులను సేకరించిన ఎన్యుమరేటర్లు, ప్రైవేట్ ఆపరేటర్లతో కలిపి ఆదివారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. పది రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ధైర్యంగా ఉండాలి

చందుర్తి నవంబర్26: సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా ఉండాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై, మాట్లాడారు. మనసులో కలిగిన బాధను వ్యక్తపర్చడం ద్వారా మానసిక స్వాంతన కలుగుతుందన్నారు. యోగా, క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

మాట్లాడుతున్న సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా

కలెక్టరేట్, నవంబర్ 26: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా పేర్కొన్నారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సమాఖ్యలో నిర్వహించిన అవగాహన శిబిరానికి ఆమె హాజరయ్యారు. ఇక్కడ డీపీఎం పద్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఏ సరిత, సఖీ కేంద్రం కౌన్సిలర్ అంజలి, సీసీలు ఉన్నారు.

రైస్‌మిల్లుల్లో తూకాల తనిఖీ

- 'నమస్తే' కథనానికి స్పందన

కోనరావుపేట, నవంబర్ 26: రైస్‌మిల్లర్లు తూకంలో మోసం చేస్తున్నారని 'తూకంలో మోసం.. మిల్లర్లతో రైతుల వాగ్వాదం' అనే శీర్షిక ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా తూనిక కొలతలశాఖ అధికారులు స్పందించారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న మారుతి, సరస్వతీ, శ్రీలక్ష్మీగణపతి, కనకదుర్గ రైస్‌మిల్లులను జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి రూపేశ్‌కుమార్ తనిఖీచేశారు. తూకంతోపాటు వారు నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. రైతులకు నష్టపరిచే విధంగా మిల్లర్లు తూకం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
CHANGE OF NAME
Nandelli Laxmi Rani W/o. Ramchander rao,(old Name) H.No. 2-8-49/1, Autonagar Sircilla Town & Mandal,Rajanna Sircilla Dist. My Name Was changed to Nandelli Laxmi W/o. RamchanderRao (New Name)
NTK-335466

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189